

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా వినాయకం



శ్రీకాకుళం కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా కుడిమి వినాయకం గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పల్నాడు జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారిగా పని చేశారు. ఈడీగా బాధ్యతలు చేపట్టాక కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని ఆయన అన్నారు.





నరసన్నపేట సామాజిక ఆసుపత్రి

- వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా జారీ
- అనర్హులకు మంజూరు
- రూ.20వేల నుంచి రూ.60వేల వరకు వసూలు
- నరసన్నపేట కేంద్రంగా వైద్యుల చేతివాటం
- ఈ వ్యవహారంపై కూటమి సర్కారు విచారణ
- పలువురు డాక్టర్లకు నోటీసులు జారీ

సదరం పత్రాలు

- గత వైసీపీ ప్రభుత్వంలో ఓ ప్రజాప్రతినిధి వ్యక్తిగత సహాయకుల సిఫారసుల మేరకు జలుమూరు, కోటబొమ్మాళి మండలాల్లో సుమారు 47 మంది దివ్యాంగులుగా సదరం ధ్రువపత్రాలను వైద్యులు అందజేశారు. వీరిలో చాలామంది అనర్హులు ఉన్నారు. వీరంతా సుమారు రెండున్నరేళ్ల పాటు ప్రభుత్వ పింఛన్ తీసుకున్నారు. అప్పట్లో టీడీపీ నాయకులు ఈ వ్యవహారంపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలో రావడంతో అసలు బండారం బయట పడింది.
- జలుమూరు, నరసన్నపేట, పోలాకి మండలాల్లో పనిచేస్తున్న కొందరు ఉపాధ్యాయులు బదిలీల్లో అదనపు పాయింట్ల కోసం అడ్డదారులు తొక్కారు. దీనికోసం నరసన్నపేట ఆస్పత్రిలోని వైద్యులను సంప్రందించారు. వారికి 40శాతం అంగవైకల్యం ఉంటే 70శాతానికి పైగా అంగవైకల్యం ఉన్నట్లు ధ్రువీకరణ పత్రాలను వైద్యులు జారీ చేశారు. అలాగే నరసన్నపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన వలంటీరు రోడ్డు ప్రమాదానికి గురైతే అతని కుడికాలు లోపల రాడ్ వేశారు. ఆయన కూడా 60 శాతం దివ్యాంగుడని చెప్పి సదరం ధ్రువపత్రం ఇచ్చారు. ప్రస్తుతం ఆయన పింఛన్ పొందుతున్నాడు.
- రెండున్నరేళ్ల కిందట పొందూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన 18 మంది దివ్యాంగులకు సదరం ధ్రువపత్రాలు జారీ చేశారు. వీరిలో చాలామంది అనర్హులు ఉన్నారని అప్పట్లో కలెక్టర్ గ్రీవెన్స్‌లో కొందరు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు దర్యాప్తు నిర్వహించి వారికి పింఛన్ నిలుపుదల చేశారు. కానీ ధ్రువపత్రాల ఇచ్చిన వైద్యులపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఆ వైద్యులు నరసన్నపేట సామాజిక ఆసుపత్రి కేంద్రంగా గత రెండున్నరేళ్లలో అడ్డూఅదుపు లేకుండా అనర్హులకు సదరం ధ్రువపత్రాలను జారీ చేశారు.

నరసన్నపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నరసన్నపేట సామాజిక ఆసుపత్రి కేంద్రంగా కొందరు వైద్యులు అడ్డగోలుగా సదరం ధ్రువపత్రాలను జారీ చేశారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు సిఫారసుల మేరకు ఎందరో అనర్హులకు దివ్యాంగ ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేశారు. ఈ పత్రాలతో కొందరు పింఛన్లు, మరికొందరు ప్రభుత్వ ఉద్యోగాలు పొందారు. నాలుగేళ్ల కిందట నరసన్నపేట సీహెచ్‌సీలో ఆర్థోపెడిక్ విభాగంలో పనిచేసిన ఒక వైద్యుడు ఇందులో ఆరితేరారు. అప్పటి ఒక ప్రజాప్రతినిధి వ్యక్తిగత సహాయకులు సిఫారసుల మేరకు పదుల సంఖ్యలో దివ్యాంగ పత్రాలు జారీ చేశారు. మరికొందరి నుంచి రూ.20 వేల నుంచి రూ.60 వేల వరకు తీసుకుని సదరం ద్వారా ధ్రువీకరణ పత్రాలు అందించారు. నరసన్నపేట ఆసుపత్రి ద్వారా ఇస్తే తెలిసిపోతుందని ఆ డాక్టర్ డిప్యూటేషన్‌పై పనిచేసే రణస్థలం, ఇచ్ఛాపురం తదితర సామాజిక ఆసుపత్రుల నుంచి కూడా భారీ స్థాయిలో అనర్హులకు దివ్యాంగ ధ్రువపత్రాలను జారీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

నకిలీ పత్రాలతో ఉద్యోగాలు..

2023లో చేపట్టిన ఉపాధ్యాయ బదిలీల్లో అదనపు పాయింట్ల కోసం కొందరు దివ్యాంగ టీచర్లు అడ్డదారులు తొక్కారు. బదిలీల ముందు వరకూ వారికి 40 శాతం నుంచి 50శాతం వరకు వైకల్యం ఉన్నట్లు ధ్రువపత్రాలు ఉండేవి. అయితే, బదిలీలు చేపట్టే సరికి 70శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్నట్లు ధ్రువీకరణ పత్రాలు పొంది బదిలీల్లో ప్రాధాన్యత పొందారు. నరసన్నపేట, రణస్థలం సామాజిక ఆసుపత్రులకు చెందిన కొందరు వైద్యులే ఈ పత్రాలను జారీ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నకిలీ పత్రాలతో పలువురు ఉపాధ్యాయ, ప్రభుత్వ ఉద్యోగాలు కూడా పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. కవిటి, కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురం తదితర మండలాల్లో ఎక్కువ శాతం నకిలీ పత్రాలతో ఉద్యోగాలు చేస్తున్నట్లు సమాచారం.



నరసన్నపేట ఆసుపత్రిలో జారీ చేసిన సదరం ధ్రువపత్రాలను పునఃపరిశీలిస్తున్న వైద్యుల బృందం (ఫైల్)

అంతా ఆ ఇద్దరే..

వాస్తవానికి సదరం సర్టిఫికెట్లు జారీచేసే సమయంలో సంబంధిత దివ్యాంగులను క్షేత్రస్థాయిలో వైద్యులు పరిశీలించి వారి అంగవైకల్యం శాతాన్ని కంప్యూటర్‌లో నిక్షిప్తం చేస్తారు. తరువాత సదరు డాక్టర్ డిజిటల్ సంతకం చేస్తారు. ఆ తరువాత రెండో డాక్టర్ చూస్తారు. ఆయన కూడా సంతకం చేసిన తరువాత ఆసుపత్రి సూపరింటెండెంట్ డిజిటల్ సంతకం చేసి సదరం సర్టిఫికెట్‌ను మంజూరు చేస్తారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో నరసన్నపేట ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ విభాగంలో పని చేసిన వైద్యుడితో పాటు అవుట్‌సోర్సింగ్ విధానంలో పని చేసిన ఓ కంప్యూటర్ ఆపరేటర్ నకిలీ సదరం ధ్రువపత్రాల జారీ విషయంలో అంతా తామై వ్యవహరించారు. ఆర్థోపెడిక్ వైద్యుడిపై నమ్మకంతో రెండో వైద్యుడు కూడా సంతకం చేసిసేవారు. ఈ ఇద్దరూ సంతకం చేశారు కదా అని సూపరింటెంటెంట్‌గా కూడా సంతకం చేసి ధ్రువపత్రాలను మంజూరు చేసేవారు. కూటమి ప్రభుత్వం ఈ వ్యవహారంపై దర్యాప్తు నిర్వహించింది. ఈ మేరకు అప్పట్లో నరసన్నపేట ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా పని చేసిన బి.జయశ్రీ, ఆర్థోపెడిక్ వైద్యులు చల్ల మోహన్ రవికిరణ్, పి.నాగమల్లేశ్వరి, బాలక నవీన్‌కు నోటీసులు జారీ చేసింది. ఈ వ్యవహారం బయట పడటంతో కంప్యూటర్ ఆపరేటర్ పరారైనట్లు సమాచారం. ఒక వైద్యుడు అధికార, ప్రతిపక్ష నాయకులతో తనకు బంధుత్వం ఉందని, ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తనకు ఏమీ కాదని బహిరంగంగా చెప్పుకు తిరుగుతున్నట్లు తెలుస్తోంది. ఒక్కరు చేసిన తప్పుకు తమను బాధ్యులను చేయడంపై మిగతా వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



అక్రమ నిర్మాణాలను అడ్డుకుంటున్న ఎంపీడీవో, అధికారులు

మూడోసారి..

- ప్రభుత్వ స్థలం ఆక్రమణకు వైసీపీ నేతల యత్నం
- అడ్డుకున్న అధికారులు, పోలీసులు

నరసన్నపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున గ్రామ పంచాయతీ కార్యాలయానికి ఎదురుగా ఉన్న బోర్డు బంగ్లాకు చెందిన ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు వైసీపీ నాయకులు మూడోసారి రంగంలోకి దిగారు. ఆ స్థలం తాము కొనుగోలు చేశామని, న్యాయస్థానం ద్వారా హక్కులు పొందామని చెబుతూ గురువారం ఆ ప్రాంతంలో పనులు చేసేందుకు ఉపక్రమించగా పంచాయతీ, రెవెన్యూ అధికారులు, పోలీసులు అడ్డుకున్నారు. కోట్లాది రూపాయల విలువ చేసే ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు 2023 అక్టోబరులో వైసీపీ నేతలు యత్నించారు. అయితే, ఈ స్థలం ప్రభుత్వ స్థలంగా పేర్కొని అప్పట్లో పంచాయతీ అధికారులు బోర్డును ఏర్పాటు చేశారు. 2023 డిసెంబరులో మరోసారి ఆక్రమించేందుకు వైసీపీ నేతలు పూనుకోగా పెద్ద రాద్ధాంతం జరిగింది. నిర్మాణాలకు కోర్టు అనుమతి ఇచ్చిందంటూ పత్రాలు చూపించి అప్పట్లో వారు హల్‌చల్ చేశారు. సాధారణ ఎన్నికలు ముందు ఉండడంతో ముఖ్య నాయకుల సూచనల మేరకు వారు వెనక్కుతగ్గారు. తాజాగా, మూడోసారి గురువారం ఆ స్థలం వద్దకు వచ్చి ఇక్కడ కొంత భాగం కొనుగోలు చేశామని, దానికి చెందిన పత్రాలను గతంలో పనిచేసిన తహసీల్దార్ ఇచ్చారని చెబుతూ పనులు చేపట్టగా ఎంపీడీవో బి.మధుసూదనరావు, పంచాయతీ, రెవెన్యూ, పోలీసు అధికారులతో కలిసి అడ్డుకున్నారు. ఆమదాలవలసకు చెందిన వైసీపీ నాయకులు స్థానిక బొరిగివలసకు చెందిన కొందరితో చేతులు కలిపి బోర్డు బంగ్లా ఆస్తిపై కన్నువేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న ఈ స్థలం కోట్లాది రూపాయల విలువ చేస్తుంది. ఇది జిల్లా పరిషత్‌కు చెందినది. ఈ స్థలంలో 2008లో కొందరు నిర్మాణాలు చేపట్టగా పలువురు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. అప్పట్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులకు లోకాయుక్త నోటీసులు జారీ చేసింది. దీంతో ఈ స్థలం వైపు ఎవరూ కన్నెత్తి చూడలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు ఆ పార్టీ నేతలు ఎత్తుగడలు వేస్తున్నారు.

పౌల్ట్రీ కుదేలు

- బర్డ్ ఫ్లూతో భారీగా పడిపోయిన చికెన్, గుడ్ల అమ్మకాలు
- ధరలు కూడా పతనం
- కొనుగోలుకు వెనకడుగేస్తున్న ప్రజలు
- వెలవెలబోతున్న చికెన్ షాపులు
- కిటకిటలాడుతున్న చేపలు, మటన్ దుకాణాలు



శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ కారణంగా చికెన్ పేరు వింటేనే జిల్లా వాసులు హడలిపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా చికెన్ అమ్మకాలు ఒక్కసారిగా పడిపోయాయి. జిల్లాలో ఇప్పటి వరకు అధికారికంగా బర్డ్‌ఫ్లూ ఉన్నట్లు అధికారులు నిర్ధారించలేదు. కానీ, సామాజిక మాధ్యమాల్లో బర్డ్‌ఫ్లూపై లేనిపోని భయాలను సృష్టిస్తూ సాగుతున్న ప్రచారంతో ఎక్కువ మంది చికెన్, గుడ్లు తినడం మానేశారు. ఫలితంగా చికెన్, గుడ్లు ధరలు భారీగా పడిపోయాయి. వినియోగదారులు కన్నెత్తి చూడకపోవడంతో చికెన్ షాపులు బోసిపోతున్నాయి. దీంతో జిల్లాలో పౌల్ట్రీ రంగం తీవ్ర సంక్షోభంలో పడిపోయింది.

జిల్లాలో పరిస్థితి..

జిల్లాలో 22 ప్రాంతాల్లో కోళ్ల ఫారాలు ఉన్నాయి. వీటిల్లో 14,18,151 బాయిలర్ కోళ్లు, 4,84,020 గుడ్లు పెట్టే కోళ్లు (లేయర్స్), 1,15,000 (గ్రోవర్స్)పెంపుడు కోళ్లు ఉన్నాయి. రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ ప్రబలకముందు జిల్లా వ్యాప్తంగా రోజుకి వేల కేజీల చికెన్ విక్రయాలు జరిగేవి. ప్రస్తుతం బర్డ్‌ఫ్లూ ప్రభావంతో వందల కేజీలకు విక్రయాలు పడిపోయాయని వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. వారం రోజుల కిందట మార్కెట్లో స్కిన్‌లెస్ కేజీ రూ.240, స్కిన్ రూ.200 ఉండేది. గురువారం నాటికి స్కిన్‌లెస్ రూ.170, స్కిన్ రూ.150కి పడిపోయింది. ఇక లైవ్ విషయానికొస్తే కేజీ రూ.100 నుంచి రూ.110కి వచ్చేసింది. గుడ్డు వారం రోజుల కిందట రూ.7ఉండేది. ఇప్పుడు రూ.6కు అమ్ముతున్నారు. ఇలాగే పరిస్థితి ఉంటే కేజీ చికెన్ రూ.100కు అమ్ముకునే దుస్థితి ఏర్పడుతుందని వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు.

నష్టాల బాట..

బర్డ్‌ఫ్లూ ప్రభావంతో ప్రతి పౌల్ట్రీలోనూ కోళ్లకు వ్యాక్సిన్లు వేయిస్తున్నారు. దీంతో రూ.లక్షల్లో ఖర్చు అవుతోంది. మరోపక్క చికెన్ అమ్మకాలు భారీగా పడిపోయాయి. దీంతో పౌల్ట్రీ వ్యాపారులు నష్టాలు చవిచూస్తున్నారు. ఈ నెల 12నపౌల్ట్రీల్లో హోల్‌సేల్‌గా గుడ్డు ధర రూ.5.70 ఉండగా 15వ తేదీకి రూ.1.10 తగ్గి రూ.4.60కి వచ్చేసింది. గురువారం ఏకంగా రూ.4కి గుడ్డు ధర పడిపోయింది. ఒక పౌల్ట్రీ నుంచి రోజుకి 2లక్షల గుడ్లు బయటకి వెళ్తుంటాయి. బర్డ్‌ఫ్లూ ప్రభావంతో ధరలు పడిపోవడంతో ఈ రెండు లక్షల గుడ్లపై రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు నష్టపోతున్నామని పౌల్ట్రీ వ్యాపారులు వాపోతున్నారు. చికెన్ లైవ్ హోల్‌సేల్‌లో కేజీ రూ.48కి పడిపోగా, మార్కెట్‌లో లైవ్ రూ.100 నుంచి రూ.110కి పడిపోయింది. ఈ నష్టాల నుంచి కోలుకోవాలంటే మరో రెండేళ్లు పడుతుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



శ్రీకాకుళంలో వెలవెలబోతున్న చికెన్ దుకాణాలు

రూ.లక్షల్లో నష్టపోతున్నాం



మా కోళ్ల ఫారం నుంచి రోజుకి 2లక్షల గుడ్లు ఎగుమతి చేస్తున్నాం. బర్డ్‌ఫ్లూ దెబ్బకు రోజుకు రూ.2లక్షలకు పైగా నష్టం వస్తుంది. గత వారం రోజుల్లో గుడ్డు ధర రూ.5.70 నుంచి రూ.4కు పడిపోయింది. ఒక గుడ్డుకి 1.70పైసలు నష్టం వస్తుంది. హోల్‌సేల్‌లో గుడ్డు రూ.4కు విక్రయిస్తున్నాం. మార్కెట్లో మాత్రం గుడ్డు ధర తగ్గలేదు. ఇదే కొనసాగితే పూర్తిగా నష్టాలపాలవుతాం. ప్రభుత్వం స్పందించి పౌల్ట్రీ రంగాన్ని ఆదుకోవాలి.

- రామకృష్ణ చౌదరి, కోళ్ల ఫారం యజమాని

చేపలు, మటన్‌కు గిరాకీ

బర్డ్‌ఫ్లూ ప్రభావంతో చికెన్ వద్దంటున్న జనం మటన్, చేపల వైపు మొగ్గు చూపిస్తున్నారు. దీంతో వాటి విక్రయాలు ఒక్కసారిగా పెరిగాయి. ధరలకు కూడా రెక్కలు వచ్చేశాయి. మటన్ కేజీ రూ.900 నుంచి రూ.వెయ్యి, చేపలు కేజీ రూ.250 నుంచి రూ.300 వరకు పెరిగింది. జిల్లాలో చేపల మార్కెట్లు, మటన్ విక్రయ కేంద్రాల వద్ద జనాలు క్యూ కడుతున్నారు. మరో వైపు చికెన్ దుకాణాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

చికెన్ తినడం లేదు

జిల్లాలో బర్డ్‌ఫ్లూతో కోళ్లు చనిపోతున్నాయని సామాజిక మాధ్యమాల్లో చూస్తున్నాం. ఆ భయంతోనే చికెన్, గుడ్లు కొనడం లేదు. చేపలు, మటన్ కొంటున్నాం.

-బలివాడ రూపవాణి, గృహిణి, శ్రీకాకుళం

జిల్లాలో బర్డ్‌ఫ్లూ లేదు



జిల్లాలో బర్డ్‌ఫ్లూ లేదు. ఇప్పటికే పశుసంవర్ధక శాఖ అధికారులు కోళ్ల ఫారాలు సందర్శించి నమూనాలు సేకరించారు. ఎక్కడ లక్షణాలు బయటపడలేదు. ఈ విషయంలో ప్రజలు అనవసరంగా భయపడవద్దు. గుడ్లు, చికెన్‌ను బాగా ఉడికించి తినొచ్చు. ఇటువంటి భయాలతో రైతులు కోళ్లను పెంచడం ఆపేస్తారు. దీంతో ఉత్పత్తి తగ్గే అవకాశం ఉంది. బర్డ్‌ఫ్లూపై ప్రజలు అపోహలు వీడి చికెన్ కొనుగోలు చేయండి.

-కె.రాజగోపాల్, జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ



కల్పవృక్ష వాహనసేవలో..

- మందసలో కన్నులపండువగా బ్రహ్మోత్సవాలు
- నేడు స్వామి కల్యాణ మహోత్సవం

6లో

ఇక తప్పించుకోలేరు!

- ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందే
- 1 నుంచి మోటారు వాహన చట్టం కఠినతరం

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్గానిక్ పంటలు

6లో

- ఫలితాలు ఇస్తున్న పోషణ్ వాటికలు
- పోషకాల లోపం ఉన్న చిన్నారులకు ఆరోగ్య రక్షణ

నేటికి వాయిదా పడిన జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

అరసవల్లి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు వాయిదా పడ్డాయి. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఈ సమావేశాలు జరగాల్సి ఉండగా, కోరం లేకపోవడంతో శుక్రవారానికి వాయిదా వేశారు. ఈ మేరకు జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా ఒక ప్రకటన విడుదల చేశారు.

23 మంది సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

జి.సిగడాం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎనిమిది సచివాలయాల్లో పని చేస్తున్న 23 మంది ఉద్యోగులకు గురువారం షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీవో గుంట ముక్కల రామకృష్ణ తెలిపారు. సమయపాలన పాటించని కారణంగా పెంట, మెట్టవలస, వెలగాడ, మునినివలస, సీతంపేట, డీఆర్‌వలస, గెడ్డకంచరాం, జాడ సచివాలయాల్లో వివిధ హోదాల్లో పని చేస్తున్న 23 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. ఇప్పటికైనా విధులకు సక్రమంగా హాజరుకావాలని, లేదంటే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్గానిక్ పంటలు

- ఫలితాలు ఇస్తున్న పోషణ్ వాటికలు
- పోషకాల లోపం ఉన్న చిన్నారులకు ఆరోగ్య రక్షణ



సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం అంగన్‌వాడీ కేంద్రంలో పండిస్తున్న ఆర్గానిక్ కాయగూర పంటలు

ఆమదాలవలస, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి)

జిల్లాలో చాలామంది చిన్నారులు పోషకాహారం పూర్తిస్థాయిలో అందక అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీరిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అంగన్వాడీ కేంద్రాల్లో ఆర్గానిక్ పంటలు పండించడానికి పోషణ్ వాటికలను ఏర్పాటు చేసింది. చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా కార్యాచరణ చేపట్టింది. ఈ పోషన్ వాటికల ద్వారా అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పిస్తూనే ప్రకృతి సాగు పద్ధతిలో పండించిన ఆకుకూరలు, కాయగూరలు లబ్ధిదారులకు అందిస్తారు. మొదటి విడత ఆమదాలవలస ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పొందూరు, ఆమదాలవలస మండలాల్లో కనిమెట్టలో రెండు కేంద్రాలు, నెల్లిపర్తిలో రెండు కేంద్రాలు, వీఆర్ గూడెం, ఎస్ఆర్‌సీపేట, సీతారాంనగర్‌లో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 8 అంగన్వాడీ కేంద్రాలను ఎంపిక చేశారు. అలాగే బూర్జ ప్రాజెక్టు పరిధిలోని సరుబుజ్జిలి, బూర్జ మండలాల్లో పురుషోత్తపురంలో రెండు కేంద్రాలు, కొల్లివలస, చీడివలస, గుత్తావెల్లిలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం ఐదు కేంద్రాలను ఎంపిక చేశారు. ఒక్కో కేంద్రంలో సాగుకు పది వేల రూపాయలు చొప్పున మంజూరు చేశారు. పోషణ వాటికలతో పౌష్టికాహారం అందడంతో పాటు మొక్కల పెంపకంపై పిల్లలకు అవగాహన కలుగుతుంది.

మూడు శాఖల సిబ్బంది అనుసంధానం..

ఈ పథకం అమలుకు మూడు శాఖల సిబ్బందిని ప్రభుత్వం అనుసంధానం చేసింది. అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది స్థల సేకరణ చేశాక.. ఉపాధి సిబ్బంది ఆధ్వర్యంలో భూమిని శుభ్రం చేసి మడులు ఏర్పాటు చేస్తారు. కేంద్రీయ వ్యవసాయ సిబ్బంది విత్తనాలు, జీవామృతం, కషాయాలు అంగన్వాడీ సిబ్బందికి అందిస్తారు. ఆతర్వాత కూరగాయలు, ఆకుకూరల పెంపకం చేపడుతారు. ప్రస్తుతం వీటిని పండించి గర్భిణులకు పంపిణీ చేయడంతో పాటు పిల్లలకు అందించే ఆహారం ఇస్తున్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో విరివిగా పండుతున్న టమాటా



చిన్నారులకు పాఠాలు చెబుతున్న అంగన్‌వాడీ కార్యకర్త

ధరలు పెరిగినా ఇబ్బంది లేకుండా..

కూరగాయల ధరలు పెరుగుతున్న సమయంలో వాటిని కొనలేని పరిస్థితి ఉంది. మెనూ ప్రకారం ఆకుకూరలు తప్పనిసరి. ఈ పథకం ద్వారా సమస్యకు పరిష్కారం లభిస్తోంది. వీటిపోషణ కార్యకర్తలు, ఆయాలే చూసుకుంటున్నారు. పోషణ వాటిక ఎప్పుడూ కొనసాగించాలని ప్రభుత్వం ఆదేశించింది. దానికి అనుగుణంగా ఒక పంట ముగిశాక వదిలేయకుండా మళ్లీనెలలో మట్టిని తిరగబెట్టి విత్తనాలు చల్లుతున్నారు. ఆకుకూరలు సాగుచేసిన చోట అవి పూర్తయ్యాక మళ్లీ వేస్తున్నారు.

● దీనిపై ఆమదాలవలస, బూర్జ ఐసీడీఎస్ పీవోలు అనురాధ, గీత మాట్లాడుతూ ఈ పథకం ద్వారా బాలింతలు, గర్భిణులకు మంచి పౌష్టికాహారం అందించవచ్చన్నారు. మొదటి విడతలో 13 కేంద్రాల్లో అమలు తీరు ఆశాజనకంగా ఉందన్నారు.

కల్పవృక్ష వాహనసేవలో..

- మందసలో కన్నులపండువగా బ్రహ్మోత్సవాలు
- నేడు స్వామి కల్యాణ మహోత్సవం



చిన్నారుల నృత్య ప్రదర్శన



తిరువీధిలో కల్పవృక్ష వాహనంలో స్వామివారు..

హరిపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మందస వాసుదేవ ఆలయంలో బ్రహ్మోత్సవాలు నాలుగో రోజు గురువారం వాసుదేవ పెరుమాళ్ స్వామి భక్తులకు వేణుగోపాలుడి రూపంలో దర్శనమిచ్చారు. స్వామికి అభిషేకం చేసిన అర్చకులు.. కల్పవృక్ష వాహన సేవ నిర్వహించారు. అనంతరం యాగశాలలో లక్ష్మీ పూజ, విశేష హోమం చేపట్టారు. అనంతరం భక్తులకు శ్రీ త్రిదండి దేవనాథ రామానుజ స్వామి అనుగ్రహ భాషణం చేపట్టారు. నాలుగోరోజు భక్తులు అధిక సంఖ్యలో హజరై ధ్వజస్తంభాన్ని పూజించి స్వామిని దర్శించి తరించారు. సాయంసంధ్య వేళలో స్వామివారు హంస వాహనం, గజ వాహనాలపై తిరువీధుల్లో విహరించారు. వేలాది మంది భక్తుల నడుమ ఈ మహోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం బెజ్జిపుట్టుగ శ్రీమాన్ శ్రీనివాసరావు బృందం వారిచే సంగీత విభావరి, సాయి మెహర్ నృత్య కళానికేతన్ వారిచే నృత్యప్రదర్శన భక్తులకు కనువిందు చేశాయి.

నేడు కల్యాణ మహోత్సవం..

బ్రహ్మోత్సవాల ఐదో రోజైన శుక్రవారం ఉదయం 9గంటలకు యాగశాలలో విశేష హోమాలు, 10 గంటలకు భూసమేత శ్రీ వాసుదేవ కల్యాణమహోత్సవం, జీయర్ స్వాముల మంగళాసనములు, సాయంత్రం గరుడవాహన సేవ కార్యక్రమాలు ఉంటాయి.

ఈ నీటినే తాగాలి

- కొళాయిల ద్వారా బురదనీరు
- ఇబ్బందులు పడుతున్న చందనగిరి గిరిజనులు



కొళాయి ద్వారా వస్తున్న బురద నీరు



పాడైన పైపులు

మెళియాపుట్టి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కొండలపై గ్రామాల ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. చందనగిరి గ్రామంలో కొళాయిల ద్వారా బురద నీరు సరఫరా అవుతోంది. దీంతో వారం తా ఎక్కడ అనారోగ్యాలకు గురవుతామోనన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామంలో సుమారు 50 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ గ్రామానికి గత 20 ఏళ్లుగా గ్రావిటీ ద్వారా తాగునీటి ని అందిస్తున్నారు. కొండపై ఉన్న జక్కర నీటిని పైపుల ద్వారా గ్రామ సమీపంలో ట్యాంకుకు.. అక్కడి నుంచి కొళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. అయితే ఇటీవల 'పల్లె పండగ'లో భాగంగా వీధిలో సీసీ రోడ్డు వేసే సమయంలో ఎక్స్‌కవేటర్‌ను ఉప యోగించడం వల్ల పైప్‌లైన్లు పగిలిపో యి బురద నీరు ఆ పైపుల్లోకి చేరింది. దీంతో గడచిన 10 రోజులుగా ఆ బురద నీరే కొళాయిల ద్వారా వస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. దీనిపై అనేక పర్యాయాలు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానిక గిరిజనులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా కుంకుమ పూజలు

కవిటి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): చిన్నకర్రివానిపాలెం గ్రామం వద్దనున్న శ్రీకాశీ విశ్వనాథ స్వామి ఆలయంలో గురువారం కుంకుమ పూజలను ఘనంగా నిర్వహించారు. శివస్వాముల ఆధ్వర్యంలో అంబులం పూజ చేశారు. అనంతరం మహిళలతో కుంకుమ పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో కొత్తపాలెం, బట్టివానిపాలెం గ్రామాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు.





వాహనంలో ఉన్న ఆవులు

అక్రమంగా ఆవుల తరలింపు

- మూడు వాహనాలు సీజ్

సరుబుజ్జిలి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సరుబుజ్జిలి నాలుగు రోడ్ల కూడలిలో గురువారం తెల్లవారుజామున కబేలాలకు ఆవులను తరలిస్తున్న మూడు వాహనాలను స్థానిక ఎస్ఐ బి.హైమావతి పట్టుకున్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం సరుబుజ్జిలి నాలుగు రోడ్ల కూడలిలో సిబ్బందితో రాత్రి గస్తీ నిర్వహిస్తున్న సమయంలో హిరమండలం వైపు నుంచి వస్తున్న మూడు వాహనాలను ఆపి పోలీసులు తనిఖీ చేశారు. అందులో మూగజీవాలను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జరిగిందన్నారు. మూడు వాహనాల్లో ఉన్న 8 మందిని విచారించగా ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఈ గోవులను కొనుగోలు చేసి కబేలాలకు తరలిస్తున్నట్లు ఒప్పుకున్నారని తెలిపారు. ఎనిమిది మంది వ్యక్తులపై కేసు నమోదు చేసి మూడు వాహనాలను సీజ్ చేశామన్నారు. మూడు వాహనాల్లో ఉన్న 28 గోవులను విజయనగరం జిల్లా గుర్ల మండలం గుజంగివలసలో ఉన్న గోశాలకు తరలించినట్టు ఎస్ఐ హైమావతి తెలిపారు. పశువుల అక్రమ రవాణాను అడ్డుకున్న పోలీసులను మండల బీజేపీ అధ్యక్షుడు, బజరంగ్‌దళ్ సేవా కన్వీనర్ గోవిందరావు అభినందించారు.

జాతీయ స్థాయిలో సత్తా చాటండి

- జిల్లా ఒలింపిక్ సంఘం సీఈవో సుందరరావు

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో పాల్గొననున్న రాష్ట్ర సాఫ్ట్‌బాల్ జట్టు విజయంతో తిరిగి రావాలని జిల్లా ఒలింపిక్ సంఘం సీఈవో పి.సుందరరావు ఆకాంక్షించారు. స్థానిక కోడిరామ్మూర్తి స్టేడియంలో ఐదు రోజుల నుంచి జరుగుతున్న సీనియర్ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జట్టు విజయాల్లో శ్రీకాకుళం క్రీడాకారులు ముఖ్యభూమిక పోషించడం సంతోషకరమన్నారు. ఈ పోటీలు ఈ నెల 22వ తేదీ నుంచి 26వ తేదీ వరకు మహారాష్ట్రలోని నాగపూర్‌లో జరుగుతాయి. ఈ కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు కలిదిండి నరసింహరాజు, ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సూర శ్రీనివాసరావు, కన్వీనర్ కె.వెంకటరామరాజు, జిల్లా పీఈటీ, పీడీల సంఘం అధ్యక్షులు ఎం.వి.రమణ, ఉపాధ్యక్షులు ఎం.తిరుపతిరావు, కోచ్ బద్రీనాథ్, సురేష్, మహేష్, సమంత రెడ్డి, గ్రిగ్ సెక్రటరీ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

ఇక తప్పించుకోలేరు!

- ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందే..
- ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు, కేసులు
- 1 నుంచి మోటారు వాహన చట్టం కఠినతరం



వాహనాల రికార్డులు పరిశీలిస్తున్న పోలీసులు

మోటారు వాహన చట్టంలోని నిబంధనలు పక్కాగా అమలు చేసే దిశగా పోలీసు, రవాణా శాఖలు అడుగులు వేయబోతున్నాయి. వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నాయి. హెల్మెట్, సీటు బెల్టులు తప్పనిసరిగా ధరించేలా చూడాలని ప్రయత్నిస్తున్నాయి. లేదంటే భారీ స్థాయిలో జరిమానాలు.. శిక్షలు విధించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి.

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి)

ఇకపై ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతామంటే కుదరదు. హెల్మెట్ తప్పనిసరి. ఆపై అన్నిరకాల ధ్రువపత్రాలు ఉండాలి. నిబంధనలు పాటించాలి. లేకుంటే భారీగా జరిమానాలు చెల్లించక తప్పదు. హైకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం మార్చి 1 నుంచి గట్టిగానే చర్యలకు దిగనుంది. మోటారు వాహన చట్టాలను మరింత కఠినంగా అమలు చేసేందుకు రవాణా, పోలీసు శాఖలు సిద్ధమవుతున్నాయి. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాల మోత మోగించనున్నారు. చట్టాన్ని పట్టించుకోకపోతే లైసెన్స్‌లనూ రద్దు చేయనున్నారు. ఇందుకు సంబంధించి పోలీసు శాఖ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. ప్రతి వాహనదారుడి వివరాలు అందులో ఉంటాయి. గతంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారు.. చలానా కట్టనివారి వివరాలు ఇట్టే అందుబాటులోకి వస్తాయి. దానికి అనుగుణంగా జరిమానాలు విధిస్తారు.

● ఇకపై ఇలా...

హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే.. ఇప్పటి వరకూ రూ.135 జరిమానా వేసేవారు. ఇక నుంచి రూ.1000 కట్టాల్సిందే. వెనుక కూర్చున్న వారు హెల్మెట్ ధరించకపోతే రూ.1000, వాహనానికి ఇన్సూరెన్స్ లేకపోతే రూ.1000, రెండోసారి పట్టుబడితే రూ.2000, భారీ సైలెన్సర్లతో సౌండ్ పొల్యూషన్‌కు పాల్పడితే రూ.2000, రెండోసారి దొరికితే రూ.4000, పరిమితికి మించి వాహనాల్లో ఎక్కించుకుంటే మనిషికి రూ.200 వంతున జరిమానా విధిస్తారు. మైనర్లు డ్రైవింగ్ చేసి పట్టుబడితే రూ.1000, నిషేధం ఉన్న ప్రాంతాల్లో పార్కింగ్ చేస్తే రూ.1500 నుంచి రూ.2000, బైక్ రేసుల్లో పాల్గొంటే రూ.5000, రెండోసారి అందులో దొరికితే రూ.10 వేలు, తాగి వాహనం నడిపితే మూడు నెలల జైలు శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధిస్తారు. లైసెన్స్ లేకుండా బండి నడిపితే రూ.10 వేలు వసూలు చేస్తారు. విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ సిబ్బందితో వాగ్వాదానికి దిగితే కేసులు నమోదు చేస్తారు. 90 రోజుల్లో జరిమానా కట్టకపోతే వాహనాన్ని సీజ్ చేస్తారు. దీనిని అమలు చేసేందుకు పోలీసు, రవాణా శాఖలు ఏర్పాట్లు చేస్తున్నాయి.

ప్రజల్లో మార్పు కోసమే..



రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా వాహనదారులకు నిత్యం అవగాహన కల్పిస్తున్నాం. మార్చి 1 నుంచి వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందే. గ్రామీణ ప్రాంతాల నుంచి ఓవర్ లోడ్‌తో ఆటోలు శ్రీకాకుళం నగరంలోకి వస్తున్నాయి. దీనివల్ల రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారి సంఖ్య పెరుగుతోంది. దీన్ని నియంత్రించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ఇకపై నిబందనలు కఠినంగా అమలు చేస్తాం. మూడుసార్లు కన్నా ఎక్కువసార్లు మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 23 మంది లైసెన్స్‌ల రద్దుకు సిఫారసు చేశాం. మరో 15 మంది జాబితాను కూడా సిద్ధం చేశాం. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఓ వ్యక్తికి నెల రోజుల జైలు శిక్ష పడింది.

-నాగరాజు, ట్రాఫిక్ సీఐ, శ్రీకాకుళం

అసభ్యకర పోస్టులు పెడితే చర్యలు : ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్, యూట్యూబ్, ఎక్స్(ట్విట్టర్) తదితర సోషల్ మీడియా వేదికల్లో ఇతరులను కించపరిచేలా అసభ్యకరమైన, అనైతిక, అవమానకర రీతిలో పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తులు, సంస్థలపై హేయమైన, అసత్య ప్రచారాలు, అవమానకరమైన పదజాలంతో ఫొటోలు, వీడియోలు మార్ఫింగ్, ట్రోలింగ్ చేసినా, వ్యక్తిగత దూషణలు, బెదిరింపులు, కించపరిచే వ్యాఖ్యలు చేసినా... చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాగోలు గ్రామంలో ఉన్న జెమ్స్ కళాశాలలో మూడు పోస్ట్ బేసిక్ నర్సింగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని బొల్లినేని మెడ్‌స్కిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో కోరారు. బీఎస్సీ నర్సింగ్‌కు ఇంటర్ బైపీసీ పాస్, పోస్ట్ బేసిక్ నర్సింగ్‌కు జీఎన్ఎం ఉత్తీర్ణులు అర్హులని తెలిపారు. వివరాలకు జెమ్స్ కళాశాలలో గానీ,76809 45357,79950 13422 నెంబర్లకు గానీ సంప్రదించాలని ఆయన సూచించారు.

రక్తదానానికి ముందుకు రావాలి

శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): యువత రక్తదానం చెయ్యాలని జేసీఐ శ్రీకాకుళం సన్‌రైజర్స్ అధ్యక్షులు సింగూరు ప్రవీణ్ కుమార్ అన్నారు. స్థానిక డే అండ్ నైట్ కూడలి వద్ద గల విజయశ్రీ రక్తనిధి కేంద్రంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా.భీమశంకర్, దూసి సంతోష్, డా.వినోద్, బగాది ప్రవీణ్, ఎన్ని జగదీష్, షర్మిల పాల్గొన్నారు.

పోలీసుల స్పెషల్ డ్రైవ్


ప్రయాణికులతో మాట్లాడుతున్న పోలీసులు

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మహిళలకు రక్షణ కల్పించే దిశగా జిల్లా పోలీసు యంత్రాంగం చర్యలు చేపడుతోంది. గురువారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో రెండో పట్టణ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కళాశాల, ఉద్యోగానంతరం ఇంటికి వెళ్లేందుకు ఆర్టీసి కాంప్లెక్స్‌కు వచ్చే విద్యార్థినులు, మహిళల వెంటపడే ఆకతాయిలను పోలీసులు గుర్తించారు. వారిని స్టేషన్‌కు తరలించి... తల్లిదండ్రులను పిలిపించి సీఐ పి.ఈశ్వరరావు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇకపై ఇటువంటి ఆగడాలకు పాల్పడితే పిల్లలతో పాటు తల్లిదండ్రులపై కూడా కేసులు పెడతామని సీఐ హెచ్చరించారు.

'తండేల్' దంపతులకు సత్కారం


రామారావు దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఈ ప్రాంత మత్స్యకారులు గుజరాత్‌లో ఎదుర్కొంటున్న సమస్యల ఆధారంగా రూపొందించిన 'తండేల్' సినిమా విజయవంతమైన విషయం తెలిసిందే. ఈ కథకు మూల కారణమైన డి.మత్స్యలేశం పంచాయతీకి చెందిన 'తండేల్' గనగళ్ల రామారావు దంపతులను స్థానిక శాసన సభ్యుడు నడుకుదిటి ఈశ్వరరావు గురువారం క్యాంప్ కార్యాలయంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

రఘువర్మకు మరో అవకాశం ఇవ్వండి

ఆమదాలవలస, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మకు మరో అవకాశం ఇవ్వాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి, ఉపాధ్యాయ ప్రధాన సంపాదకులు షేక్‌జిలాని, రాష్ట్ర కార్యదర్శి డి.సరస్వతి కోరారు. పట్టణం, మండలంలోని వివిధ పాఠశాలలను వీరు గురువారం సందర్శించారు. రఘువర్మకు మొదటి ప్రాధాన్య ఓటును వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.అప్పలనాయుడు, రాష్ట్ర కౌన్సిలర్ బి.చంద్రశేఖర్, ఆడిట్ కమిటీ కన్వీనర్ టి.సూర్యనారాయణ, నాయకులు హెచ్.వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గెలుపు ఖాయం

అరసవల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీగా కూటమి అభ్యర్థి రఘువర్మ గెలుపు ఖాయమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పీఎంజే బాబు అన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాట పటిమ రఘువర్మ సొంతమని అన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

కవిటి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కవిటికి చెందిన నాగేశ్వర బెనర్జీ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్టు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు టి.జయరాం తెలిపారు. జిల్లా స్థాయి మాస్టర్ చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొన్న నాగేశ్వర బెనర్జీ సింగిల్స్ విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడన్నారు. ఈనెల 21నుంచి 25వరకు విజయవాడలో జరిగే పోటీలలో పాల్గొంటాడని తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

కంచిలి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయిలో జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాలని ఎంఈఓ ప్రసాద్ తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సోంపేటకు చెందిన ఫైర్ ఆఫీసర్ మోహన్‌రావు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్ వల్ల ప్రమాదాలు సంభవిస్తే... సిలిండర్‌పై తడిగోనె సంచి, సిల్వర్ బకెట్లతో మూతవేయాలని సూచించారు.

అప్రమత్తం

సోంపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఫైర్ ఆఫీసర్ ఎస్.మోహనరావు సూచించారు. అంగన్‌వాడీలతో స్థానిక ప్రభుత్వ పాఠశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యంగా మహిళలు వంట గదిలో గ్యాస్ ఉపయోగించే సమయంలో జాగ్రత్తలు వహించాలని కోరారు.

క్విజ్ పోటీల విజేత కంచిలి

కంచిలి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కవిటి మండలం లండారిపుట్టుగ గ్రామంలో గురువారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్విజ్ పోటీల్లో కంచిలి మండలంలోని ఎక్కల ప్రాథమికోన్నత పాఠశాల జట్టు విజయం సాధించింది. ఈ పోటీల్లో మొత్తం 115 జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా విజేత జట్టుకు హెచ్ఎం అభినందించారు.

ఆశా వర్కర్లకు ముగిసిన శిక్షణ

అరసవల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అయోడిన్ లోపం వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు వస్తాయనే అంశంపై ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ (ఐజీడీ) ఆధ్వర్యంలో ఆశా వర్కర్లకు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. శిక్షణ పూర్తి చేసుకున్న ఆశాలకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ బాలమురళీకృష్ణ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ రవిప్రసాద్, వాన సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వినతులపై ప్రత్యేక దృష్టి

జి.సిగడాం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన వినతులు తక్షణమే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

70 మందికి కంటి పరీక్షలు

సరుబుజ్జిలి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సరుబుజ్జిలి జంక్షన్‌లో ఉన్న ఎస్‌వీఐ క్లినిక్ వద్ద గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 70 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కంటి వైద్య శిబిరంలో 20 మందికి కంటి ఆపరేషన్లు చేయాలని నిర్ధారించారు.

రీసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం: కలెక్టర్


ఈ క్రాప్ నమోదుపై రైతులతో చర్చిస్తున్న కలెక్టర్

ఆమదాలవలస, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రీసర్వేతో దీర్ఘకాలికంగా ఉన్న రైతుల భూ సమస్యలకు చెక్ పెట్టవచ్చునని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పండ్కర్ అన్నారు. గురువారం రామచంద్రాపురం పంచాయతీ పరిధిలోని ఆనందపురం గ్రామాన్ని సందర్శించారు. సర్వేలోని లోటుపాట్లను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూసర్వేతో రైతులకు మేలు కలుగుతుందన్నారు. సర్వే స క్రమంగా నిర్వహించి... రైతుల భూ సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించారు. ఆనందపురం గ్రామం రహదారి నిలిచిపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఇరిగేషన్‌కు సంబంధించిన సమస్య ఉండడంతో రహదారి పనులు నిలిచిపోయాయని అక్కడి ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇరిగేషన్ అధికారులను పంపించి.. రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు.

పొలం పరిశీలన

టి.జొన్నవలస సచివాలయ పరిధిలోని సంత కొత్తవలస రెవెన్యూ గ్రామంలో రబీ ఈ-పంట వివరాలను వ్యవసాయాధికారులను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. సర్వే నెంబర్ 29-17లోని రైతు పొండ్రంకి అనంతరావు పొలాన్ని పరిశీలించి ఈ క్రాప్ట్ నమోదును చెక్ చేశారు. పొలంలో ఏ పంటను పండించారు? దిగుబడులు ఎలా ఉన్నాయని రైతును ప్రశ్నించారు. రైతు అనంతరావు మాట్లాడుతూ మినుము పండించామని, దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ జేడీ కె.త్రినాథ స్వామి, ఏడీ బగ్గు రజని, మండల వ్యవసాయాధికారి మెట్ట మోహన్‌రావు, సర్వేయర్ బొడ్డేపల్లి గోపి, ఆర్ఐ పి.గోవిందరావు, వ్యవసాయశాఖ ఏఈవో మెట్ట సాయిదీప్తి తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేట్' సేవలు అభినందనీయం

శ్రీకాకుళం కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మౌలిక సదుపాయాల కల్పనకు కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతగా ముందుకు రావడం అభినందనీయమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ముఖ్య ప్రణాళికా విభాగం ఆధ్వర్యంలో వివిధ కార్పొరేట్ సంస్థల యాజమాన్య ప్రతినిధులతో కలెక్టర్ కార్యాలయంలో గురువారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మంచినీటి వసతి, పాఠశాలలు, కళాశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం, ఆసుపత్రులలో మౌలిక సదుపాయాల కల్పనపై సమీక్షించారు. పనుల అంచనాలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి లక్ష్మీ ప్రసన్న, పరిశ్రమల మేనేజర్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

కోదండరాముని కల్యాణం

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): లక్ష్ముడుపేటలోని కోదండ రామస్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 25వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయని ధర్మకర్త మెట్ట భూపాలరావు తెలిపారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి: ఎమ్మెల్యే


రజకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

అరసవల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కులవృత్తుల వారికి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. పట్టణంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద రజకులకు ఇచ్చే దోబీఖానాలు, బ్రాహ్మణులకు ఇచ్చే స్థలాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థలాలకు సంబంధించి రోడ్డు సదుపాయం కల్పించనున్నామని తెలిపారు. ఈ ప్రాంతంలో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు తక్షణ చర్యలు చేపడతామన్నారు. సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

శ్రీకాకుళం అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో పని చేస్తున్న పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎమ్మెల్యే గొండు శంకర్‌ను కోరారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు టి.తిరుపతిరావు, శానిటరీ మేస్త్రీల సంఘం అధ్యక్షుడు ముద్దాడ రామారావు, నాయకులు గురుమూర్తి, గణేష్, మణి, సూర్యకళ, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

'అన్నెపు' జీవిత చరిత్ర ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రమీల తదితరులు

శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సమాజంలోని సంస్కరణలకు ఆద్యుడిగా పేరొందిన సర్ రావు బహదూర్ అన్నెపు పరశురాం పాత్రో జీవిత చరిత్ర అందరికీ ఆదర్శమని మాజీ ఎం.పి.పి. కూన ప్రమీల అన్నారు. కళింగ కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక కొత్తరోడ్డులో ఉన్న శాంతి కన్వెన్షన్‌లో సర్ రావు బహదూర్ అన్నెపు పరశురాం జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కూన ప్రమీల మాట్లాడుతూ అన్నెపు పరశురాం పాత్రో జీవిత చరిత్రను భవిష్యత్తు తరాలకు అందించాలని సంకల్పించిన రచయిత గూన అప్పారావును అభినందించారు. ఈ కార్యక్రమంలో సెషన్స్ అండ్ జిల్లా పూర్వ న్యాయాధికారి పప్పల జగన్నాథరావు, అంబేద్కర్ వర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ హనుమంతు లజపతిరాయ్, మాజీ ఐఏఎస్ సూర బాలకృష్ణారావు, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ మెంటార్ బి.వి.ఎస్.ఎన్.రాజు, ప్రొఫెసర్ గుంట లీలా వరప్రసాద్, దుప్పల రవికుమార్, డాక్టర్ పి.సూర్యం, బగాది నారాయణరావు, బి.శ్రీరామమూర్తి, బొడ్డేపల్లి మోహనరావు, మెట్ట అన్నాజీ భట్లు, డా.అన్నెపు శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్ష కేంద్రం మంజూరు

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల కేంద్రం మంజూరు చేస్తూ విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై మాజీ ఎంపీటీసీ సభ్యుడు, టీడీపీ సీనియర్ నాయకులు పాతిర్ల చంద్రశేఖర్‌రెడ్డి, గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. సెంటర్ మంజూరుకు కృషి చేసిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్' అందుకున్న ప్రవీణ్


అవార్డు అందుకుంటున్న పుల్లట ప్రవీణ్

అరసవల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): దుబాయ్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఇండియన్ సెఫాలజిస్ట్ డా.ప్రవీణ్ పుల్లట వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, లండన్ జ్యూరీ అవార్డును అందుకున్నారు. ఏపీ-2024 ఎన్నికల్లో 60 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీ అభ్యర్థులకు రాజకీయ వ్యూహకర్తగా వ్యవహరించిన ఆయన 99శాతం ఫలితాలు సాధించినట్టు నిర్వాహకులు తెలిపారు. అభ్యర్థులకు 18వేల పేజీల డేటా అనలిటిక్స్ అందించినందుకు ఈ రికార్డు ఆయనను వరించిందని వివరించారు. ప్రపంచంలో ఈ ఘనత సాధించిన తొలి సెఫాలజిస్టుగా ప్రవీణ్ రికార్డు సృష్టించారు. అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్రమంత్రి రామదాస్ అథవాలే, వరల్డ్ ట్రేడ్ సెంటర్ ఉపాధ్యక్షుడు మెమెర్ అబ్దుల్ కరీం జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు
దరఖాస్తుల ఆహ్వానం

గుజరాతీపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయం (బాలురు) అంపోలు, శాస్త్రులపేట పాఠశాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమన్వయకర్త అనూరాధ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్, ఐదో తరగతి, 6 నుంచి 9వ తరగతి బ్యాక్‌లాగ్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. అర్హులైన బాలురు, బాలికలు ఆన్‌లైన్ ద్వారా మార్చి 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 20న నిర్వహిస్తామని తెలిపారు. ఐదో తరగతికి ఏప్రిల్ 27న, బ్యాక్‌లాగ్ ప్రవేశాలకు 28న ప్రవేశపరీక్ష ఉటుందన్నారు. ఇతర వివరాలకు 96188 80991 నెంబరుకు సం ప్రదించాలని సూచించారు.

హామీలు నెరవేర్చండి

గుజరాతీపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని క్రాంతి భవన్‌లో ఎస్టీయూ నాయకులు గురువారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే బకాయిలు చెల్లిస్తామని, డీఏలు, ఐఆర్, సకాలంలో ఇస్తామని ప్రతిపక్ష నేతగా చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు, ఎం.తేజ, ఎస్.లక్ష్మణరావు, పి.వసంత కుమారి, తదితరులు పాల్గొన్నారు. ఈ మేరకు సీఎంకు పోస్టు కార్డులు రాశారు.

నిధులు విడుదల

బూర్జ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ పంచాయతీలకు ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడు, డ్రైన్ల నిర్మాణానికి రూ.4.143 లక్షలు మంజూరైనట్టు మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు విలేకరులతో గురువారం మాట్లాడారు. నిధులు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు రాజహతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో తోటి కార్మికులు ఒకొక్కరు రూ.500 వంతున చందాలు వేసుకొని రూ.30వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని గురువారం బాధితుడి భార్యకు మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రమేష్ పాల్గొన్నారు.

మెరుగైన సేవలకు కృషి

జి.సిగడాం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ విద్యార్థులకు మెరుగైన సేవలు అందించాలని ఐఆర్‌టీ జిల్లా కో-ఆర్డినేటర్ బి.గోవిందరావు అన్నారు. గురువారం స్థానిక భవిత కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

● ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఇషాన్‌బాషా

హిరమండలం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ హిరమండలంలో తాగు నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఇషాన్‌బాషా తెలిపారు. గురువారం 'ఆంధ్ర జ్యోతి'లో 'తాగు నీటికి ఎంతకష్టం' శీర్షికన వచ్చిన కథ నానికి ఆయన స్పందించారు. ఈ మేరకు చిన్నకోరాడ వీధిలో వేసిన జల్‌జీవన్ మిషన్ పైపులైన్లను, గొట్టా బ్యారేజి దిగువన ఉన్న రక్షిత నీటి పథ కం ఇన్‌ఫిల్ట్రేషన్ బావులను పరిశీలించారు. కొళాయిల ద్వారానీరు అందకపోవడానికి కార ణాలను డీఈఈ వెంకటప్పల నాయుడు, ఏఈ సాగర్‌లను అడిగి తెలుసుకున్నారు. నీటి పథ కానికి నీరందించే ఇన్‌ఫిల్ట్రేషన్ బావులు రెండు అడు గంటి పోయా యని, దీంతో ట్యాంకులకు నీరం దడం లేదని వారు ఆయనకు వివరించారు. ఇంటింటికి వేసిన కొళాయిల ద్వారా నీరు రాక, పాత పైప్ లైన్లు తొలగించడంతో రోజుల తరబడి నీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కోరాడ వీధి మహిళ లు ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ.. పంచాయతీ మొత్తానికి నీరు సక్రమం గా అందించేందుకు బ్యారేజి దిగువన నాలుగు బోర్లను తవ్వేం దుకు ప్రతిపాదనలు తయారు చేయా లని ఆదేశించారు. వారం రోజుల్లోగా పనులు ప్రా రంభించి యుద్ధప్రాతిపాదికన పూర్తి చేయాలన్నారు. చిన్నకోరాడ వీధిలో జేజేఎం పనులు పూర్తయ్యే వరకు పాత సీపీ డబ్ల్యూఎస్ పథకం పైపులైన్ల ద్వారానే నీరం దించాలని డీఈఈకి సూచించారు. పంచా యతీలో తాగు నీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాల న్నారు.



చిన్న కోరాడ వీధిలో జేజేఎం పైపులైన్లను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఇషాన్‌బాషా

నీటి ఇక్కట్లు లేకుండా చూడండి: డీఎల్పీవో

పాతపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పెద్ద లోగిడి గ్రామంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని డీఎల్పీవో గోపిబాల అన్నారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో "జల్‌జీవన్‌పై నీలినీడలు' శీర్షికతో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. ఈ మేరకు ఆయన క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అనం తరం పంచాయతీ కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు. వాటర్ ట్యాంకుకు నీరివ్వలేని పరిస్థితికి కారణాలను పంచాయతీ కార్యదర్శి వెంకటరమణను అడిగి తెలుసుకున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో పనులు పూర్తి చేసి పంచాయతీకి అప్పగించాల్సి ఉందని వివ రించారు. కొత్త ట్యాంకు సమీపంలో ఉన్న బావిపైనే ఆధారపడి ఉన్నామని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణం బావి చుట్టూ ఉన్న పిచ్చి మొక్క లను తొలగించాలని, ప్లాట్‌ఫారం నిర్మించి క్లోరినేషన్ చేయాలని డీఎల్పీవో ఆదేశించారు. ఇప్పటికే ఉన్న కొళాయిల ద్వారా తాగునీరందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్నవాడు, ఈవోపీ ఆర్డీ ఎల్.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నిస్తున్న డీఎల్పీవో గోపిబాల

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

క్రైం కార్నర్

ఫొటో మార్ఫింగ్ కేసులో ఇద్దరి అరెస్టు

శ్రీకాకుళంక్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మహిళ ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్‌మీడియా, వెబ్‌సైట్లలో పోస్టులు చేసిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు రెండవ పట్టణ సీఐ పి.ఈశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన తెలిపిన వివరా లిలా ఉన్నాయి.. నగరానికి చెందిన ఓ మహిళ వీడియోలను, ఫొటోలను గుర్తు తెలియని వ్యక్తులు సోషల్ మీడియా, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్‌తో పాటు పలు వెబ్‌సైట్లో పోస్టు చేశారు. అయితే బాధిత మహిళ తన స్నేహి తుల ద్వారా ఈ విషయం తెలుసుకుని రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి దృష్టికి తీసుకు వెళ్లారు. ఆయన ఆదేశాలతో సీఐ సైబర్ క్రైమ్ సిబ్బందితో కలిసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన షేక్ మహ్మద్ సోయల్‌ను గురువారం తిరుపతిలో పట్టుకుని అతనితో పాటు మార్ఫింగ్ పోస్టింగ్‌లో భాగస్వాము లైన నందికొట్టూరు గ్రామానికి చెందిన ఉప్పుగళ్ల రఘును అదుపులోకి తీసుకుని సీఐ విచారించారు. గతంలో షేక్ మహ్మద్ సోయల్ బాధిత మహిళ ఫొటోలు సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడని, నిజంగానే పోస్టు చేశాడని ఈ విషయాన్ని విచారణలో అంగీకరించినట్లు సీఐ తెలిపారు. దీంతో సోయల్, రఘులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. మహిళల వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియా పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

బంగారు బిస్కెట్ మోసం కేసులో నిందితుల అరెస్ట్

సంతబొమ్మాళి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కిలో బంగారం రూ.10 లక్షలకే ఇస్తామని చెప్పి 21 మంది వద్ద రూ.కోటికి పైగా వసూలు చేసి మోసం చేసిన కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు నౌపడ ఎస్ఐ నారాయణ స్వామి గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. నౌపడకు చెందిన దుక్క దేవి కిలో బంగారం రూ.10 లక్షలకే ఇస్తానని పలువురిని నమ్మించి రూ.కోటికి పైగా మొత్తాన్ని వసూలు చేసింది. దుక్క దేవితోపాటు బుడ్డెపు లోకేశ్ అదే గ్రామానికి చెందిన కమ్మకట్ల భాగ్యలక్ష్మికి కిలో బంగారం బిస్కెట్‌లు రూ.10 లక్షలకే ఇస్తామని ఆశ చూపి రూ.32 లక్షలు నగదు తీసుకున్నారు. అయితే బంగారు బిస్కెట్‌లు ఇవ్వకపోడంతో పలుమార్లు వారిని నిలదీసింది. ఈ విషయమై గ్రామపెద్దల వద్ద పలుమార్లు చర్చించినా ఫలితం లేకపోయింది. ఈనెల 9న రాత్రి 8 గంటల సమయంలో నిందితులు దుక్క దేవి, లోకేశ్, సావిత్రి, పైల లక్ష్మి, జగదాంబ బాధితురాలు కమ్మకట్ల భాగ్యలక్ష్మిపై దాడి చేసి గాయపరిచారు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారించామని, నిందితులైన దేవితో పాటు బుడ్డెపు లోకేశ్, బుడ్డెపు సావిత్రి, పైల లక్ష్మి, దుక్క జగదాంబలను అరెస్ట్ చేసి కోటబొమ్మాళి కోర్టుకు తరలించామని ఎస్ఐ తెలిపారు.

మృతుడి ఆచూకీ లభ్యం



త్రినాథరావు (ఫైల్)

శ్రీకాకుళంక్రైం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): నగరంలో హయాతినగరం సమీపంలో నాగావళి నదిలో బుధవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యం కాగా మృతుడు తోటపాలెం దగ్గర నీలమ్మ కాలనీకి చెందిన దండు త్రినాథ రావు(45)గా గుర్తించినట్లు వన్‌టౌన్ ఎస్ఐ ఎం.హరికృష్ణ గురువారం తెలిపారు. ఈనెల 14న మృతుడు త్రినాథ రావు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని అతని భార్య వెంకటలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. త్రినాథరావు ఓ దుకాణంలో కమ్మరి పనిచేస్తుండే వాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారన్నారు. మద్యం మత్తులో తరచూ ఇంటి నుంచి వెళ్లి పోతుండేవాడని భార్య పోలీసులకు చెప్పింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

చోరీ బంగారం రికవరీ

ఎల్.ఎన్.పేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): చింతలబడవంజ గ్రామ పంచాయతీ చిట్టిమండలం కాలనీలో పదిరోజుల కిందట జరిగిన దొంగతనం కేసులో చోరీ చేసిన బంగారాన్ని రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు సరుబుజ్జిలి ఎస్ఐ బి.హైమావతి తెలిపారు. ఆమె తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కాలనీకి చెందిన ఆవల లక్ష్మి ఇంటిలో నాలుగు తులాల బంగారం చోరీకి గురైంది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోవు చేసి దర్యాప్తు చేపట్టారు. అదే గ్రామానికి చెందిన ఎల్.పావని ఈ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించి ఆమె నుంచి బంగారం స్వాధీనం చేసుకుని గురువారం లక్ష్మికి అందజేశారు.

నాలుగు రోజుల్లో 4 కేసుల నమోదు

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధిలో గత 4 రోజుల్లో వివిధ గ్రామాల్లో దాడి చేసి నాలుగు కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ డి.దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన మద్యంతో పట్టుబడిన వారిపై ఒకటి, డ్యూటీ పెయిడ్ లిక్కర్ కేసులు 3 నమోదు చేశామన్నారు. సారా కేసుల్లో పట్టుబడిన 18 మందికి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. అలాగే కవిటి మండలంలో ఉన్న పాత నేరస్థులను బైండోవర్ చేసేందుకు ప్రతిపాదనలు పంపించామన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పెద్దబమ్మిడి గ్రామ సమీపంలో ఈనెల 3న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న సుబ్బారావుపేటకి చెందిన బాన్న ప్రత్యూష (29) గురువారం మృతి చెందినట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. భర్త నడుపుతున్న ఆటోలో వెళుతూ ఎదురుగా వెళుతున్న కారును ఢీ కొనడంతో ప్రత్యూష తీవ్రంగా గాయపడింది. భార్యభర్తలిద్దరూ డాన్సు మాస్టర్లుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మృతురాలికి భర్త కిరణ్‌కుమార్, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

దుకాణాలపై దాడి: ఇద్దరి అరెస్ట్

హిరమండలం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): భగీరథపురంలో రెండు దుకాణాలపై గురువారం ఎస్ఐ ఎండీ యాసిన్ సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరి వద్ద నుంచి 28 మద్యం బాటిళ్లు, మరో దుకాణంలో 8 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు వీరిద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు డీఎస్సీలో ప్రాధాన్యం ఇవ్వాలి

జలుమూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షలో ఔట్‌సోర్సింగ్ విధానం, కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులకు వచ్చే డీఎస్సీలో ప్రాధాన్యత మార్కులు కేటాయించాలని మండల సీఆర్‌ఎంటీల అధ్యక్షుడు పట్ట వైకుంఠరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మార్సీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. సమగ్రశిక్షలో గత 13 ఏళ్లుగా వివిధ విభాగాల్లో తక్కువ జీతంలో పనిచేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం మా విజ్ఞప్తులను విస్మరించడంతో కాంట్రాక్టు ఔట్ సోర్సింగు పద్ధతిలో పనిచేసే ఉద్యోగలు భవిష్యత్తు అంధకారం అయిందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి వచ్చే డీఎస్సీలో ప్రాధాన్యత మార్కులు కేటాయించి ఆదుకోవాలని కోరారు.

సంపద తయారీ కేంద్రాలను వినియోగించాలి

పాతపట్నం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని డీఎల్పీవో గోపిబాల అన్నారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి దాని నుంచి ఎరువులు ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో చంద్రకుమారి, మండల ప్రత్యేకాధికారి డా.మంచు కరుణాకరరావు, ఈవోపీఆర్డీ ఎల్.వెంకటరావు పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగం

● సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసులు

మెళియాపుట్టి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కొసమాళ పంచాయతీ నిధులు దుర్వినియోగంపై స్థానికుడు డిప్యూటీ సీఎం పేషీకి చేసిన ఫిర్యాదు మేరకు అధికారులు విచారణ చేపట్టి గతంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన మనోహర్, సర్పంచ్ ఉర్లన రవికుమార్‌కు గురువారం డీపీవో భారతి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీవో ప్రసాద్ పండా తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పంచాయతీలో నిధులు దుర్వినియోగ మయ్యాయని స్థానిక యువకుడు జగదీష్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేషీకి ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడి అధికారుల ఆదేశాల మేరకు టెక్కలి డీఎల్పీవో గోపిబాల ఇటీవల పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టి నివేదికను డీపీవోకి అందించారు. దీని ఆధారంగా షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. గతంలో సర్పంచ్ చెక్‌పవర్ కూడా రద్దు చేసిన సంగతి తెలిసిందే. మళ్లీ ఫిర్యాదులు రావడంతో మరోసారి విచారణ చేపట్టారు. అభియోగాలున్న అంశాలకు సమాధానం ఇవ్వాలని, లేకుంటే తదుపరి చర్యలు తీసుకుం టామని ఆ నోటీసుల్లో పేర్కొన్నట్లు ఎంపీడీవో తెలిపారు.

శిష్టకరణ ఫౌండేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

టెక్కలి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): శిష్టకరణ ఫౌండేషన్ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మానాపురం సురేష్ కుమార్ ప్రకటించి నియామక పత్రా లను గురువారం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా సదాశివుని రవికుమార్, ఉపాధ్య క్షుడిగా బెహరా రాజేష్‌కుమార్, ప్రధానకార్యదర్శిగా నౌపడా నర్సింగరావు, కోశాధికారిగా డబ్బీరు మానస్ వినోద్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నామన్నారు. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ.. శిష్టకరణ సామాజికవర్గానికి రాజకీయ ప్రాబల్యం కలిగిం చేందుకు కృషి చేస్తానన్నారు.

ఇంకుడు గుంతల పనులు వేగవంతం చేయాలి

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని 38 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీపనుల ద్వారా ఇంకుడు గుంతల పనులను వేగవంతం చేయాలని ఏపీడీ పి.శైలజ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీ కార్యాలయంలో క్షేత్ర సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్, ఏపీవో జి.హరిప్రసాద్, ఈసీ టి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పథకంలో కాలువ పనులు

నరసన్నపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో కాలువ పనులు చేపడట్టడం జరుగుతుందని డ్వామా పీడీ బి.సుధాకరరావు అన్నారు. గురువారం కోమర్తిలో మబుగాం ఛానల్ పనులన పరిశీలించారు. రైతులకు ఉపయోగపడేలా పనులను వేతనదారులతో చేయించాలన్నారు. పనుల్లో నాణ్యత ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో యుగంధర్, అప్పలరాజు పాల్గొన్నారు.

సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడండి

హిరమండలం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రబీ పంటలకు సాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రాజెక్టు కమిటీ అధ్యక్షుడు అరవల రవీంద్ర సూచించారు. ఈ మేరకు గురువారం ఆయన వంశధార రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వంశధార కట్టడాల విభాగం ఈఈ ఎంవీరమణ రిజర్వాయర్ వివరాలను ఆయనకు వివరించారు. జిల్లాలో రబీ సీజన్‌లో పంటలకు సాగునీటి సమస్య ఉందని, రిజర్వాయర్ ద్వారా నీటిని విడిచి పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని రవీంద్ర కోరారు.

జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించండి

పాతపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు పండించే జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా చొరవ తీసుకోవాలని ఆదివాసీ సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే మామిడి గోవింద రావును కలిసి వినతిపత్రం అందించారు. జీడి పంటకు గిట్టుబాటు ధర ప్రకటించకపోవడంతో వ్యాపారుల దోపిడీకి గురవుతున్నామన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘ జిల్లా కార్యదర్శి ఎన్.అప్పన్న ఆ సంఘ కొత్తూరు, మెళియాపుట్టి మండలాల నాయకులు ఎస్.సుంకయ్య, ఎస్.ఆదినారాయణ పాల్గొన్నారు.

నిబంధనల మేరకు వ్యాపారాలు చేసుకోవాలి

పలాస, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): నిబంధనల మేరకే హోటల్స్‌లో తినుబండారాలు విక్రయించాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు హెచ్చరిం చారు. గురువారం కార్యాలయంలో పలాస-కాశీబుగ్గ పట్టణాల్లో హోటల్ యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు పరిమా ణాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఆహార ధరల బోర్డులు పెట్టాలని, అన్ని హోటళ్లలో ఒకేరకమైన ధరలుండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్నిరకాల పథకాలు వినియో గించుకునేలా ఎంఎస్‌ఎంఈ సర్వేలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఆర్ఐ ప్రభాకర రావు, టీపీవో వరప్రసాద రావు, సచివాలయ శానిటేషన్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అంధకారంలో మండల కాంప్లెక్స్ ప్రాంతం

నందిగాం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): నందిగాం మండల కాంప్లెక్స్ ప్రాంతాల్లో అంధకారం నెలకొంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటు గణేష్ కాలనీకి వెళ్లే మార్గం నుంచి గురుకుల పాఠశాల వరకు వీధి దీపాలు వెలగక పోవడంతో కార్యాలయాల ఉద్యోగులు, పనులపై వివిధ ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులు, స్థానికులు రాత్రి వేళల్లో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు ఈ ప్రాంతం రాత్రి వేళల్లో సర్వీసు రహ దారి చీకటిమయంగా ఉంటుండడంతో భయం భయంగా ఉండాల్సి వస్తోందని స్థానికులు ఎస్.గౌరమ్మ, కె.ఉష, టి.భారతమ్మ, కె.చిన్నారావు తదితరులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకో వాలని వారు కోరుతున్నారు.

వారిలో మార్పు వస్తుందా?

● జడ్పీ డిప్యూటీ సీఈవో విచారణ

సంతబొమ్మాళి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానికంగా నివాసం ఉండక ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్న ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది సకాలంలో హాజరుకాక పోతుండడంపై జడ్పీ అధికారులు అసంతృప్తితో ఉన్నారు. ఈ మేరకు మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ఇన్‌చార్జిలతో ఇక్కట్లు' శీర్షికతో కథనం వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జడ్పీ డిప్యూటీ సీఈవో సత్యనారాయణ ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం విచారణ చేపట్టారు. స్థానికంగా నివాసం ఉండకుండా ఇక్కడే ఉన్నట్లు రికార్డుల్లో చూపుతూ ప్రతినెలా హెచ్ఆర్ఏ డ్రా చేస్తున్న అంశంపై ఆయన విచారణ చేపట్టారు. ఎంపీడీవో, ఇతర సిబ్బంది ఎవరెవరు ఎక్కడి నుంచి రాకపోకలు సాగిస్తున్నారో వివరాలను సేకరించారు. తాము స్థానికంగా ఉండ డం లేదని వారంతా ఆయన ముందు అంగీకరించారు. ఇప్పటికైనా స్థానికంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన హెచ్చరించినట్లు సమాచారం. అలాగే పంచాయతీ కార్యదర్శుల పనులు చేసేందుకు కొర్రీల వేస్తున్న సీనియర్ అసిస్టెంట్ నర్సింగరావును తీవ్రంగా మందలించినట్లు తెలుస్తోంది. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తానని జడ్పీ డిప్యూటీ సీఈవో పేర్కొన్నారు. దీంతోనైనా సిబ్బందిలో మార్పు వస్తుందా లేదా అనేది వేచి చూడాల్సిందే.

500 ఇళ్లను దత్తత తీసుకోవాలి

● ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): టెక్కలి మేజర్ పంచాయతీలో పారిశుధ్యం మెరుగు కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి తెలిపారు. గురువారం సచివాలయ ఉద్యోగులు, గ్రామ పంచాయతీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ప్రతి 500 ఇళ్లకు ఒక సచివాలయ ఉద్యోగి దత్తత తీసుకోవాలని, తడి, పొడి చెత్తలను ప్రతిరోజూ సేకరించేలా పర్యవేక్షించాలన్నారు. ఇంటింటికీ వెళ్లి ఇళ్ల యజమానులకు తడి, పొడి చెత్తలను వేర్వేరుగా ఉంచి పారిశుధ్య కార్మికులకు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ ఆరోగ్యంపై అవగాహన కలిగించాలన్నారు. అనంతరం సచివాలయ ఉద్యోగులకు తడి, పొడి చెత్త వేరు చేసే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యదర్శి జగన్నాథరావు పాల్గొన్నారు.



తడి, పొడి చెత్తలపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో కృష్ణమూర్తి

మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

● ఎమ్మెల్యే బగ్గు

జలుమూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) శ్రీముఖలింగంలో ఈనెల 26 నుండి 28 వరకు నిర్వహిస్తున్న మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై గురువారం శ్రీముఖలింగంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని, అందరూ సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ ఏడాది శ్రీముఖలింగం ఉత్సవాలు రాష్ట్ర పండగగా గుర్తించేలా సీఎం చంద్రబాబుతో మాట్లాడానన్నారు. వంశధార నదిలో స్నానాలు ఆచరించిన మహిళలు వస్త్రాలు మార్చుకునేందుకు తాత్కాలిక టెంట్లు వేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ తమ్మన్నగారి సతీష్‌కుమార్, టీడీపీ నాయకులు బగ్గు అర్చన, వెలమల రాజేంద్రనాయుడు, బగ్గు గోవిందరావు, దుంగ స్వామిబాబు, పంచిరెడ్డి రామచంద్రరావు, తర్ర బలరాం, దేవ్, ఆలయ ఈవో పి.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

35 మంది కార్మికుల కేటాయింపు

శ్రీముఖలింగంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు శ్రీముఖలింగంలో పారిశుధ్య పనులు చేపట్టేందుకు 35 మంది కార్మికులను కేటాయిస్తూ డీపీవో ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీడీవో కె.అప్పలనాయుడు తెలిపారు. వీరితో పాటు 2 మేస్త్రీలను, 4 ట్రాక్టర్లను కేటాయించారన్నారు. గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఈవోపీఆర్డీలు పర్యవేక్షిస్తారన్నారు. వీరంతా ఈనెల 23 నుంచి మార్చి ఒకటో తేదీ వరకు ఈ పనులను చేపడతారని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యం కావాలి: ఎంజీఆర్

పాతపట్నం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి విజయమే లక్ష్యంగా పాటుపడాలని ఎమ్మెల్యే మామిడి గోవింద రావు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో నియోజక వర్గపరిధిలోని ఐదు మండలాల నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధారణ ఎన్నికల్లో ఉపాధ్యాయుల ఆశీస్సులతోనే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పుడు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మను గెలిపించేలా సమష్టిగా పాటుపడాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పరిశీల కుడు గొట్టపు వెంకటనాయుడు, ఐదు మండలాల టీడీపీ అధ్యక్షులు, ఎన్డీయే కూటమి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

కార్మికుల సర్వీసును క్రమబద్ధీకరించాలి

కాశీబుగ్గ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని కార్మిక సంఘం, సీఐటీయూ నాయకులు కోరారు. గురువారం కాశీబుగ్గలో మునిపల్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇదే డిమాండ్‌తో పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బలరాం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి గణపతి మాట్లాడుతూ.. ఆప్‌కాస్ రద్దు చేసి కార్మికులను మళ్లీ కాంట్రాక్టర్ల కబంధ హస్తాలకు అప్పగించేలా ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు. సమావేశంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు మురుగన్, నాయకులు వెంకట్, కూర్మారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేటినుంచి ప్రతిష్ఠోత్సవాలు

సంతబొమ్మాళి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వడ్డివాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎండల సదాశివస్వామి పంచాయతన ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తొలిరోజు విఘ్నేశ్వర పూజ, విగ్రహాల ఊరేగింపు, జలాధివాసం, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశన తది తర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. శనివారం క్షీరాధివాసం, పంచామృతాభిషేకాలు, సూర్య నమస్కారాలు, ఆదివారం విగ్రహాల ప్రతిష్ఠ, శివ కల్యాణం తదితర కార్యక్రమాలు వేదపండితులు అంపోలు రుద్రకోటీశ్వర శర్మ, గ్రామ పురోహితులు రామాయణ సీతాపతి శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

రేపటి నుంచి అన్నాపురంలో..

నందిగాం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అన్నాపురంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి మందిర ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు శని, ఆదివారాల్లో నిర్వహి స్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం గణపతిపూజ, గ్రామ ప్రదక్షణ, పుణ్యాహ వచనం, జలాధివాసం, పంచామృతాధివాసం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. రెండో రోజు విశేష పూజలతో పాటు విగ్రహ ప్రతిష్ఠ, కళాహోమాలు, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలుంటాయన్నారు. భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకోవాలని కోరారు.

సత్యసాయి మందిర పునర్నిర్మాణం

హిరమండలం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): హిరమండలం దేవరశెట్టి వీధిలో ఉన్న సత్యసాయి మందిరం పాత భవనాన్ని గురువారం తొలగించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు అందవరపు అబ్బాయి మాట్లాడుతూ భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన భవన నిర్మాణం చేపట్టనున్నామన్నారు. సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల నాటికి నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ఈ నూతన భవనంలో ఫిజియోథెరపీ సెంటర్, ఉచిత వైద్య సేవలు, వృద్ధజన సేవలు, నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో బెహర సురేష్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు పట్టవా?

సంతబొమ్మాళి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తీరప్రాంతంలో తాగునీటి సమస్యలపై మండల అధికారులు పట్టించుకోవడం లేదని టీడీపీ మత్స్యకార నాయకుడు సూరాడ ధనరాజ్ ఆరోపిం చారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తీర ప్రాంత పంచాయతీలైన సున్నాపల్లి, మేఘవరం, మరువాడ, లక్కివలసల్లో అప్పుడే తాగునీటి ఇబ్బందులు ప్రారంభమయ్యాయన్నారు. తాగునీటి బోరుల్లో పైపులు తుప్పు పట్టాయని, వాటి స్థానంలో కొత్తవి వేయాలని కోరినా మండల పరిషత్ సిబ్బంది ముందుకు రావడం లేదన్నారు.

అధిక నిల్వలుంటే చర్యలు

నరసన్నపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాల్లో అధిక నిల్వలుంటే చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ అధికారి సునీత అన్నారు. గురువారం పట్టణంలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువులు విక్రయించేటప్పుడు రైతులకు బిల్లులివ్వాలన్నారు. వివరాలు స్టాక్ బుక్‌లో నమోదు చేయాలని, కాలం చెల్లిన పురుగుమందులు విక్రయిస్తే వ్యాపా రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఏఈవోలు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలను విడుదల చేయాలి

పలాసరూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ కల్యాణ చక్రవర్తికి వినతిపత్రం అందించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.3500 కోట్లు ఫీజు బకాయిలున్నాయన్నారు. జీవో 77ను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.వినోద్, శ్రీను పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు తప్పనిసరి

కొత్తూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులకు వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు ఉంచుకోవాలని సీఐ ప్రసాద్ తెలిపారు. కొత్తూరు నాలుగు రోడ్ల కూడలిలో గురువారం వాహనాలను తనిఖీ చేశారు. అవసరమైన పత్రాలు లేని వారి వద్ద నుంచి అపరాధ రుసుం వసూలు చేశారు. ప్రతి ఒక్కరికి లైసెన్స్ తప్పనిసరన్నారు. హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు, పూండి జంక్షన్‌లలో సీసీ కెమెరాలను గురువారం ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ బి.నిహార్ తెలిపారు. ఇప్పటికే పూండిలో షాపుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సం బంధిత యజమానులకు సూచించారు. కూడళ్లలోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిఘా పెడుతున్నట్లు ఎస్ఐ చెప్పారు.

